

# నవ్వులు – పువ్వులు



ఇసుకపల్లి లక్ష్మీ నరసింహశాస్త్రి

సావిత్రికి చిన్నతనంలో ఎన్నో కోరికలువుండేవి. కొన్నికొన్ని తన వయస్సుకు మించినవి కూడా వుండేవి. తాను పెద్దయిన తర్వాత, చెయ్యాలనిన పనులు కూడా కొన్ని ముందుగానే ఆలోచించుకుని పెట్టుకుంది. కొన్ని కోరికలు చాలా తమాషాగా కూడా వుండేవి. తనకే ఆశ్చర్యంగా వుండేది. తాను పదేళ్లప్పుడు బళ్ళోకి వెళుతుండగా, పెళ్లి పల్లకీ ఎదురయింది. బడి మానేసి ఆపల్లకీ వెంటపడింది. ఆక్షణంలో తన మనస్సులో ఎన్నో వూహాలు చెలరేగినాయి. తన పెళ్లికూడా ఒకనాడు అయిపోతుంది. పెళ్లి కొడుకు ఎవరో! ఈ తలపు ఆ క్షణంలో శరీరాన్నంతా కుదిపేసింది. ఎప్పుడో జరిగే విషయాన్ని గురించి ఇప్పటినుంచి ఆలోచించటం చాలా ఆశ్చర్యంగానే వుంది. అయినా ఆపల్లకి మాన్పిన్నంత నేపు ఇంకో ఆలోచన రానేలేదు. తన చిన్ని పెళ్లి

అవటం, అత్తారింటికి వెళ్లటం, కళ్లకు కట్టినట్లు కనిపించింది. ఏదో తెలియని ఆనందం ఆమెలో ప్రవేశించి తలక్రిందులు చేసింది. ఒకటి రెండు రోజులు ఆపల్లకీ, పెళ్లికూతురు, పెళ్లికొడుకు కళ్లల్లో మెరిసి గజిబిజిచేసి వదిలిపెట్టేవారు. పెళ్లంటే ఏమిటో అనుకునేది. పెళ్లికి వయస్సుంటుంది. అయినా ఏపని చెయ్యటానికైనా వయస్సుంటుంది. పెద్దవాళ్లు ఆ అమ్మాయికి పెళ్లీడు వచ్చిందని వాళ్లల్లోవాళ్లు అనుకోవటం చాలాసార్లు విన్నది కూడా. ఎవరైనా పెద్దవాళ్లు పెళ్లిళ్ల సంగతి చెప్పుకుంటే చాలు చప్పున అక్కడకు వచ్చి కూర్చునేది. వాళ్ల మాటలన్నీ చాలా జాగ్రత్తగా వినేది. ఆరిందాగా ఆలోచించేది. ఏమిటే నువ్విక్కడకు వచ్చి కూర్చున్నావు. రేపు పాఠాలు చదువుకోరాదు, లేకపోతే ఆడుకోరాదా వెళ్లి అనేది వాళ్లమ్మ చాలా మామూలుగానే. ఎన్నిసార్లు చెప్పినా అక్కడనుంచి కదిలేది కాదు. ఒక్కొక్కప్పుడు సావిత్రికి అర్థంకాని విషయాలు కూడా మాట్లాడుకునేవాళ్లు. ఏమిటో అర్థం కాదు, అడుగుదామంటే ఏమనుకుంటారో అని భయం. తెలిసీ తెలియని అర్థంతో తికమకపడేది. తన బుద్ధికి తగినట్టుగా ఆలోచించి తృప్తి పడేది. తనవంక తాను అదేపనిగా చూసుకుంటూ అబ్బ ఇంకా చిన్నదానిగానే వుండిపోయానే అనుకునేది! ఎప్పుడు పెద్దదాన్ని అవుతాను, ఎప్పుడు పెళ్లి అవుతుంది అని మథనపడేది. చాలామంది ఆడపిల్లలు పెద్దవాళ్లయి పోతున్నారు. వాళ్ల పెళ్లిళ్లు కూడా అయిపోతున్నాయి. ఎంత దురదృష్టవంతులో అనుకుంటూ ఎక్కడైనా పెళ్లయితేసరి అక్కడకు వెళ్లి వాళ్లవంక ఎంతో ఆవేశంగా చూసేది. అయినా ఆ అమ్మాయికి ఎన్నేళ్లని అప్పుడే పెళ్లయింది! నాకంటె ఎంత పెద్దేమిటి! నాకు పదమూడేళ్లే, ఆ అమ్మాయికి పదిహేనేళ్లు అంతేగా రెండేళ్లేగా లేదా? నాకు పదిహేనేళ్లూ వస్తాయి! అబ్బ ఇంకా రెండేళ్లే! అంటే అప్పటికి పోరుపారం అయిపోతుందన్న మాట. చాలారోజులుందే! వయస్సుల్ని పోల్చుకుంటూ బాధపడుతూ వుండేది. అమ్మాయి ఈరోజుల్లో ఆడపిల్లలకు పెళ్లిళ్లకు ఏంతొందర! మునుపటి రోజుల్లో అంటేరజస్వలా కాకమునుపు పెళ్లిళ్లు చెయ్యాలని వుండేది. ఇప్పుడదేం లేదుగా, ఇరవై ఏళ్లు పాతికేళ్లదాక వుంచుతుండే! ఏమోనమ్మ ఎవరిష్టం వాళ్లది. మా అమ్మాయికి అవుతే పదహారేళ్లు రాంగానే పెళ్లిచేసేస్తాం'' అని వాళ్ల అమ్మ ఎవరితోనో అనటం విన్నది. పదహారేళ్లు! పదహారేళ్లు! పెద్ద నిట్టూర్పు విడిచింది. ఇంకా మూడేళ్లు! ఇన్నేళ్లు నేను ఆగను. అమ్మకు చెప్పేస్తాను, వాళ్లమ్మాయికి పదిహేనేళ్లప్పుడు పెళ్లి చెయ్యలేదా మరి అనుకుంది.

ఈ మాట చెప్పడానికైనా ఇంకా రెండేండ్లు ఆగాలిసిందేగా ! పెద్ద నిట్టూర్పు విడిచేది అబ్బా అనుకుంటూ.

అసలు ఈ పెళ్లెందుకు చేసుకుంటారు ? ఏమో మరి నాకు తెలియదు అనుకునేది. వాళ్ళ పిన్ని పెళ్ళయినప్పుడు వాళ్ళత్తయ్య ఈసారి నువ్వు పిల్లల్ని ఎత్తుకురావాలి. ఏమనుకున్నావో అన్నది. ఈ మాటకు అర్థం తెలియలేదు. చక్కిలిగింతలు పెట్టినట్లు ఆ మాటకు ఒళ్ళంతా ప్రాకి తికమక పరిచినాయి. ఏమిటో అనుకుంది. ఏమోనాకు తెలియటం లేదు. ఎవరిని అడగటం ? బళ్లోంచి వస్తున్నప్పుడు స్నేహితురాళ్ళను అడుగుదా మనుకుంది. వాళ్ళు ఎగతాళి చేస్తారేమోనని వెనక్కు జంకింది. ఒకనాడుసాయంత్రంయింటికివస్తూంటే జయప్రదతో అవీ, ఇవీ మాట్లాడుతూ, ఏమే నేనో మాట అడుగుతాను చెపుతావు అన్నది సావిత్రి.

"నాకు తెలిస్తే చెపుతాను" అన్నది జయప్రద.

"ఏం లేదు ముందుగనే చెపుతున్నాను. నువ్వు మాత్రం నవ్వకూడదు తెలిసిందా" ముందుగనే జాగ్రత్త పడింది.

"అంత నవ్వొచ్చేది అడుగుతావేమిటి?" అన్నది జయప్రద.

'ఏమో నాకు తెలియదు. నే నొకటి అడుగుతాను. ఎగతాళి చెయ్యకుండా సమాధానం చెప్పాలి' అన్నది సావిత్రి.

"చెపుతాలే, అసలు ప్రశ్నఏమిటో చెప్పు ?' జయప్రద మామూలుగానే అడిగింది.

"ఏంలేదుకానీ, పెళ్లెందుకు చేసుకుంటారే " సావిత్రి చాలా బెరుకుగా జయప్రద కళ్ళలోకి చూసింది.

జయప్రద కొంచెంసేపు మూగదయింది. ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు. నవ్వుతే ఏం కోపం వస్తుందోనని తటతటాయిస్తోంది.

సావిత్రి తలకాయ వంచుకుని నిలబడింది. తలెత్తి జయప్రదవంక చూస్తే, చప్పున ఏమంటుందో నని భయంగా నిలబడిపోయింది.

"ఏముంది ... పిల్లలు కంటానికి ..." జయప్రద చప్పున అనేసింది.

సావిత్రి చప్పున తలెత్తి చూసింది. కళ్ళు పెద్దవి చేసుకుంది. అట్లాగే విశ్చేష్టరాలై చూసింది.

"ఏం అట్లా చూస్తున్నావు ?" అన్నది.

"ఏం లేదు .."

"ఎందుకు అట్లా అడిగావు ... "

"నేను పెళ్ళిచేసుకో బోతున్నాను ..."

'అప్పుడే ... ?"

"అప్పుడే అంటే ... ?"

"ఇంత చిన్న వయస్సులోనే ... !"

"అవుతేఎంతవయస్సులోచేసుకోవా లేమిటి?"

"ఏమో నా కేం తెలియదు. అసలు నువ్వడిగావు కాబట్టి చెప్పా ..." నాకు తెలిసింది అంతే. అసలు నేను పెళ్ళిచేసుకోనే చేసుకోను ..."

"ఎందుకని ? "

"పెళ్ళిచేసుకుంటే చదువుకోవడానికి వీల్లేదు. మొగుడు చెప్పినట్లు వినాలిట ..." జయప్రద పకపక నవ్వుతూ అన్నది.

సావిత్రికూడా హాయిగా నవ్వేసింది.

"నిజంగానే చెపుతున్నా నేను పెళ్ళి చేసుకోను'

"మీ అమ్మావాళ్ళూ వూరుకుంటారేమిటి ? ఇంకో ఏడాది అవుతే నీకూ పెళ్ళిచేస్తారు. నేనవుతే యింకో మూడేండ్లు ఆగాలికానీ, నీకే నువ్వు అదృష్టవంతు రాలివే!"

"నేను పెళ్ళిచేసుకోనని చెప్పటంలా ? పెళ్ళి చేసుకోగానే పిల్లలు.మనం ఏం పనీ చెయ్యలేము. . . . ఎంతసేపటికి వాళ్లను సద్దుకోవటంతోనే సరిపోతుంది. మా పిన్ని నాకు చెప్పింది. మాపిన్నిట ఎం. ఏ., వరకు చదువుకుందామనుకుందిట. అయితే మా తాతయ్య మాపిన్ని పెళ్లి చేశాడు. అందుకని చదువు మానుకుంది. ఇప్పుడు పిల్లలతో సరిపోతోంది. పెద్దచదువు చదువుకొంటే పెళ్లి చేసుకోకూడదు. . . ' జయప్రద గంభీరంగా అనేసింది.

"ఎట్లాగైనా పెళ్లిచేసుకోవాల్సిందేనే!"సావిత్రి ఎగతాళిగా అనేసింది.

'ఏమోనే అప్పుడు మాట చూద్దాంలే!' జయప్రద గంతులు వేసుకుంటూ వెళ్లిపోయింది.

సావిత్రి మనస్సులో రకరకాల ఆలోచనలు వచ్చేసి ఉక్కిరి బిక్కిరి చేసేస్తున్నాయి. చాలా ఇరకాటంలో పడిపోయింది. ఏదో మథనపడుతోంది. ఏమైనాకాని తాను పెళ్లిచేసుకోవాలి అనే దృఢ నిశ్చయంలోనే వుంది.

ప్రక్కింటి అమ్మాయి శారదపెళ్లని తెలియంగానే క్రొత్త పరికిణా, క్రొత్త జాకెట్టు కట్టుకుని కళ్యాణంబొట్టు పెట్టుకుని తోడి పెళ్లికూతురు అయింది. పెళ్లికూతురువెంట తిరగటం మొదలు పెట్టింది. ఆరెండురోజులు కూడా తన వళ్లు తనకు తెలియలేదు, ముగ్ధురాలయిపోయింది. తనకు తెలియని ఆనందంలో మునిగిపోయింది. ఆ కాసేపు కూడా తనకు పెళ్లయిందనే మనస్తత్వంలో వుండిపోయింది. పట్టలేని సంతోషంతో ఉల్లాసంగా గడిపేసింది. సావిత్రి తల్లి చూస్తూ మా అమ్మాయి కూడా పెళ్లికూతురు ఎప్పుడు అవుతుందా అనుకున్నట్లు కూతురువంక చూస్తోంది. తల్లిని చూస్తూ సావిత్రి ఎంతో మురిసిపోయింది.

చీటికిమాటికి అద్దంలో చూసుకుంటూ, కొంచెం పెద్దదాన్నిఅయినానే అని తృప్తిపడుతూ వుండేది. కాని ఇంకా పెద్దదాన్ని అవాలి అని నిస్పృహ చెందేది. తాను ఎంతో తొందరపడుతోంది. ఎప్పుడు పెద్దదాన్నవుతానా అని. అసలు పెద్దదాన్ని అవాలంటే ఏంచెయ్యాలి అనే ఆలోచన పోయింది. రకరకాలుగా ఆలోచిస్తోంది. ఎటూ తోచటంలేదు.

ఒనాడు సాయంత్రం బళ్లోంచి రాగానే గబగబ గదిలోకి వెళ్లి గడియ బిగించుకుంది. వాళ్లమ్మా సిల్కుచీరె పెట్టెలోంచి తీసింది. ఎంతో ప్రయ

త్నంచేసి కష్టపడి చీరె కట్టుకుంది. అద్దం ముందు నిలబడింది. అబ్బ! ఎంత పెద్దదాన్న య్యాను అనుకుంది. అమ్మకు చెప్పేద్దాం నేను పెద్దదాన్నయ్యానుఅనుకుంది. నన్ను చూడంగానే అమ్మఏమంటుంది. పెద్దదాన్నయ్యాను కాబట్టి పెళ్లిచేస్తుందా ? ఏమిటోఆలోచించుకుంటోంది. తలుపుతీసి నెమ్మదిగా అటూ ఇటూ చూసింది. వాళ్లమ్మ అక్కడెక్కడా కనిపించలేదు. మెల్లిగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ సావిట్లో వచ్చేసింది. వాళ్లమ్మ వంటింట్లోంచి వస్తోంది. తల్లిని చూడంగానే ఒళ్లు జల్లుమన్నట్లయింది.

'అమ్మా! నేను పెద్దదాన్నయ్యానే......' వెర్రిగా కేకపెట్టింది సావిత్రి.

ఆమెతల్లి క్షణంసేపు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయింది.

'ఏమిటే ఈ వేషం!' అన్నది ఆశ్చర్యంగా.

'ఏం నేను చీరెకట్టుకుంటే బాగాలేదుటే!'

'ఇప్పుడెందుకు కట్టుకున్నట్టు!. . .'

'కట్టుకుంటే ఏం!. . .'

'కట్టుకుందుగాన్లే అమ్మా! ఇంకా రెండేళ్లు పోతే ఆ ముచ్చటాతీరుతుంది. పరికిణాలు కట్టుకునేటప్పుడు చీరెలెందుకమ్మా. . .'

సావిత్రికి సగం అర్థమయినట్లనిపించింది. ఏమనాలో అర్థంకాలేదు. అమ్మకు నేను చీరె కట్టుకోవటం ఇష్టంలేదు అనుకుంది. ఇట్టే గదిలోకివెళ్లి తలుపులు బిగించేసింది. చీరె చెంగున విప్పేసింది. అద్దంముందు నిలబడేటప్పటికి ఎంతో చిన్నదయిపోయి నట్టనిపించింది. ఈ పరికిణా జాకెట్టు తనకేమి బాగాలేదు. తాను చీరె కట్టుకుంటేనే బాగుంటుంది. అసలు పెళ్లి చేసుకున్నప్పుడు చీరె కట్టుకోవాలి. ఏమిటి ఈ పరికిణా అసలేమి బాగానేలేదు. నేను రేపటినుంచి పరికిణా కట్టుకోను. పమిటవేసుకుంటా. తండ్రి ఉత్తరయ్యం తీసి పమిటవేసుకుని బయటకు వచ్చింది.

'మళ్లీ ఇదో వేషమా!. .'' వల్లె వేసుకుందుగాన్లే! ఇంకో ఏడాదిపోతే ఆముచ్చట తీరుతుంది. వాళ్లమ్మ చప్పున అనేసింది.

తనకు తెలియకుండానే ఎంతో సిగ్గు ముంచుకొచ్చింది. తలకాయ చప్పున వంచేసుకుని గిరున తిరిగి లోపలికి వెళ్లిపోయింది. తనలో తాను నవ్వుకుంటోంది. రెండుచేతులు మొహాన కప్పుకుని తీవ్రంగా ఆలోచించుకుంటోంది. తనకు ఏంచెయ్యాలో తోచటం లేదు. తన మనస్సు పరిపరివిధాలపోతోంది. క్షణంలో ఒక ఆలోచన మరుక్షణంలో ఇంకో ఆలోచన. ఒకదాని కొకటిపొత్తు లేదు. వింత వింత ఆలోచనలు వచ్చేసి సావిత్రిని గిలిగింతలు పెట్టేస్తున్నాయి. తెగ ఆరాటపడుతోంది. తాను కోరుకున్నంత చురుకుగా రోజులు కదులుతున్నట్లు కనబడటంలేదు. ఒకవేళ కాలం కదిలిపోతున్నా,తాను అనుకున్నంతగా పెద్దదవటం లేదు, ఏనెల కానెల అద్దంముందు నిలబడి తేడా కనబడటంలేదు. ఎప్పుడూ అదేధ్యాసమూలాన అసలు తన శరీరంలో వస్తున్న మార్పు సావిత్రికి కనబడటంలేదు.

వేసవికాలం శలవలు అయిపోయినాయి. పరీక్ష ప్యాసయింది. తన శరీరంలో మార్పు ఏమీ కనబడలేదే అని తీవ్రంగా అసంతృప్తిపడుతోంది. ఏడాది గడిచినా కూడా తాను ఎదగకపోతే ఇంకా ఎప్పుడు పెద్దదాన్నయ్యేది అని చిరాకుపడుతోంది. ఏమైనా కాని ఏళ్లలెక్కగా మనిషి ఎట్లా వుంటేయేం! ఇదోరకంగా సంతృప్తిపడేది. ఏమైనాకాని తన మధన తనకు ఉండనే వుంది. బళ్లోకి మామూలుగా వెళుతూనేవుంది. పాఠాలు చదువుతూనే వుంది. కాని తన మనస్సంతా ఇంకోచోట. తన వయస్సువాళ్లు, తనకంటె కాస్త పెద్దవాళ్లు ఆడపిల్లలు నలుగురుచేరి కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు.

పిల్లలందరూ ఏవోఒకటి మాట్లాడుతున్నారు. పాఠాల సంగతి, బళ్లో మాస్టర్ల సంగతి, ఇంట్లో తల్లితండ్రుల సంగతి, ఒక్కరూ కూడా పెళ్లిళ్ల విషయము మాట్లాడనే మాట్లాడటంలేదు. ఏ సందర్భంగానైనా పెళ్లివిషయం వస్తుందేమోనని సావిత్రి ఆదుర్దాపడుతోంది.

మాటల్లో మాటలు జయప్రద పెళ్లిసంగతి తెచ్చింది. అదేమా అప్రస్తావన తీసుకురావాలని కూడాకాదు. ఏమిటో దొర్లుకొచ్చింది. ఇంతకీ వాళ్ల మేనత్త కూతురు పెళ్లిట. బహుశా పై సోమవారం అక్కడకు వెళ్లాలిసివస్తుందేమోనని అంతకంటె ఏం లేదు.

'అయితే నీపెళ్లెప్పుడే!. ..' అన్నది అందులో ఒకమ్మాయి చప్పున.

'మనిద్దరి పెళ్లి ఒకసారే లే..' జయప్రద కోపంగా అనేసింది.

'అడుగుతే తప్పా!. . .'

'నేనన్నది మాత్రం తప్పా!.......'

'మీరిట్లాగే ఘర్షణ పెట్టుకొని యింటికి ఆలస్యంగా వెళ్లితే మనం అందరి పెళ్లిళ్లు ఒక్కసారే అవుతాయి... అన్నది అందులో ఇంకో అమ్మాయి.

అందరూ నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

జయప్రద యింటికి వెళ్లంగానే వాళ్లమ్మ ఎదురుగా వచ్చి చెక్కిళ్లన్నీ గట్టిగా రాచి లోపలికి తీసుకవెళ్లింది. మైసూరు పాకం పెట్టింది.

'వాతల్లే అంటూ లోపల లోపల ఆవేశపడిపోయింది.

జయప్రదకు ఏమీ అర్థం కాలేదు. ఏమిటి అని అడగాలని తోచనూలేదు. మైసూరు పాకం పెడుతోంది. ఆ అమ్మాయి మెదలకుండా తినేసేస్తోంది. కాఫ్పీ పెట్టింది. అది తింటోంది. అమ్మాయి ఏమైనా అడుగుతుందేమో అనుకుంది. యీ తిండి తాపత్రయంలో జయప్రద మిగతా విషయాల మీద దృష్టి పోనీయలేదు.

'అమ్మాయి నువ్వు చాలా అదృష్టవంతురాలివే' అన్నది తల్లి.

'పోనే నువ్వెప్పుడూను' మామూలు ధోరణిలోనే అనేసింది. నిన్ను చూట్టానికి రేపు వస్తున్నారు'లన్నది. ఆనందపరవశురాలయి తల్లి.

'ఏమిటీ! నన్ను చూట్టానికా! ఎందుకు?' చాలా అమాయకంగా అడిగేసింది జయప్రద.

'ఎందుకేమిటి నీమొహం! పెళ్లి చూపులకు'

'నేను పెళ్లి చేసుకోనే!.....' మొహం యింత చేసుకుని అనేసింది.

'పిచ్చా! వెర్రా! నీకేమన్నా! పెళ్లి చేసుకోనంటావేమిటి?'

ఏమన్నాలనుకోనేనుమాత్రం పెళ్లిచేసుకోను.'

'ఎవరన్నా విన్నా నవ్విపోతారు కాని ఇంకా అమాట అనక.'

'అమ్మా! నేను పెళ్లి చేసుకోను....' జయప్రద ఏడుపు మొదలు పెట్టింది.

'శుభమా అంటూ పెళ్లి సంగతి చెబితే ఏడుస్తావెందుకే!.... శనాతనం పోక తల్లి చాలా విసుగ్గా కసిరింది.

'అమ్మా! జయప్రద ఏదో చెప్పబోయింది. అమ్మాలేదు బొమ్మాలేదు కాని వెళ్లు ...'

జయప్రద మొహం అంతా కందిపోయింది వెక్కివెక్కి ఏడుస్తోంది. గదిలో కూర్చుని తల్లి ఎంత బతిమాలి చెప్పినా వినటం లేదు.

ఇదెక్కడ ఖర్మమే!' అని తల్లి నెత్తిన చేతులు పెట్టుకొని కూర్చుంది.

ఎంతో నచ్చ చెప్పటానికి ప్రయత్నించేసింది. పెళ్లి ఎందుకు చేసుకోనంటున్నావో చెప్పమంటూ వత్తిడి పెట్టింది. ఒక్క మాట చెప్పదు. పెళ్లిమాత్రం చేసుకోనంటుంది. పెళ్లంటే ఏమిటో అనుకున్నావో తెలుసా అంటూ పెళ్లిని గురించిన వివరాలు కొన్ని చెప్పటం మొదలు పెట్టింది. పల్లకీ ఎక్కొచ్చు, కొత్త చీరలు కట్టుకోవచ్చు, కొత్త కొత్త నగలు చేయిస్తారు, మన బంధువు లందరూ వస్తారు నాలుగు రోజులు పిండివంటలతో భోజనాలు అయినా యిప్పుడు పెళ్లి చేసినా రేపే వెళ్లి అత్తవారింట్లో కూర్చుంటావా ఏమిటి? చెబితే వినవేమంట! తల్లి ఒక్కటే బాధపడుతూ చెప్పుకుపోతోంది. అన్నీ విన్నట్టే వింటుంది. తీరా ఏమిటే సమాధానం చెప్పవే అని తల్లి గట్టిగా అడిగితే నేను పెళ్లి చేసుకోనే అని ఒక్కముక్క చెప్పి వూరుకుంటుంది.

తల్లి ప్రాణం విసిగి పోతుంది. ఎందుకింత పట్టుదల వచ్చిందో అర్థంకాదు. ఎవరైనా తన కూతురికి నూరి పోశారా అని తర్కించుకుంటుంది. అయినా ఎవరికి పట్టిందని ఎటూ పాలుపోవడం లేదు. ఆరాత్రి ఎట్లా గడిచిందోగడిచిందిక్షణక్షణం ఆమె గాభరా పడుతూనే వుంది. కునికిపాట్లు పడుతూనే వుంది. క్షణంలో కళ్లు తెరచి ఏమే అమ్మాయి అంటూనే వుంది. యీ కునుకుపాట్లతోనే తెల్లారిపోయింది.

తెల్లారినప్పటి నుంచి జయప్రద తల్లికి

భయమెక్కువై పోయింది. వోమూల పెళ్ళివారు సాయంత్రం వస్తారు. అమ్మాయి చూడబోతే యిట్లా వుంది ఎట్లాగా అని సతమతమై పోతోంది. జయప్రదకు ఆదుర్దా హెచ్చి పోతోంది. తన పెళ్ళి యివాళ జరిగిపోతుందేమో అని విపరీతంగా ఆందోళన పడిపోతోంది. ఎట్లాగైనా యీ పెళ్ళికొడుకు ఇవ్వాళ రాకుండా వుంటే బాగుండునని మనస్సులో ప్రార్థించుకుంటోంది.

అప్పటికప్పుడే ఆ వూరంతా ప్రాకిపోయింది. జయప్రద పెళ్ళట. చూడడానికి వరుడు యివ్వాళ సాయంత్రమే వస్తున్నాడు. సావిత్రి ఒళ్ళు పులకరించింది. కళ్ళు తిరిగిపోయాయి. జయప్రద పెళ్ళిమాట తలచుకుంటుంటే ఆశ్చర్యపడి పోతోంది. నిన్న మొన్నటిదాకా యీ పెళ్ళి సంగతే ఎవ్వరూ అనుకోలేదు. అదీ కాక జయప్రద పెళ్ళి చేసుకోనని ఖచ్చితంగా చెప్పేసింది. ఇవ్వాళ ఎట్లా పెళ్ళి చేసుకుంటుంది. అమ్మను అడుగుతాను నాకు కూడా పెళ్ళి చేసెయ్యమని సావిత్రి తనలోతాను రకరకాలు ఆలోచించుకుంటోంది. ఎగతాళీ చేసినట్లు వుంటుందేమో! ఎందుకొచ్చిందిలే అని తటపటాయిస్తోంది. జయప్రదను చూడటానికి స్నేహితురాళ్ళు వస్తే నేను ఎవ్వరినీ కలుసుకోనని కబురు పంపి లోపల్నుంచి బయటకు రానేలేదు. కొంతమంది సావిత్రి దగ్గరకు వెళ్ళి జయప్రద పెళ్ళి విషయమై విడ్డూరంగా చెబుతున్నారు. సావిత్రి ఏమీ మాట్లాడడం లేదు. తన భావాలన్నీ జయప్రదమీదే కేంద్రీకృతమై వుండిపోయినాయి. జయప్రద గురించి ఆమాయపడుతోంది. ఆమె ఎంతో అదృష్టవంతురాలు అని తానెంతో దురదృష్టవంతురాలని బాధపడుతోంది. మా అమ్మకూడా నాకు పెళ్ళి చేస్తే ఎంత బాగుంటుంది. అని ఆరాటపడిపోతోంది. ఎట్లాగైనా వోసారి జయప్రదను చూడాలని ఉబలాట పడిపోతోంది. ఎట్లాగు చూడటం. అయినా చూసి ఏమడుగు తాను. నాకేమీ అర్థం కావటం లేదు.

ఆనాడు సావిత్రి బళ్ళోకి వెళ్ళలేదు. ఒకటి రెండుసార్లు మాత్రం జయప్రదను చూడాలని ఉబలాటపడింది. కాని సమయం చిక్కలేదు. అవకాశం దొరకలేదు. ఏదోరకంగా విఘ్నం వచ్చి పడింది. అన్నం తిన్నతర్వాత తానుకూడా ఓ చీరెకట్టుకుని శృంగారించుకుని జయప్రద ఇంటికి వెళదామనుకొంది. చూసినవాళ్ళేమను కుంటారో అని సస్తాయించింది.

వోమూల వాళ్ళవస్తారని జయప్రద తల్లి ఇంట్లో సతమతమయిపోతూంటే, జయప్రదకు చీమకుట్టినట్లన్నాలేదు. తల్లిచెప్పిన ప్రతి మాటకు వ్యతిరేకమే చేస్తోంది. వోక్షణంలో పెద్దవినుగు పుట్టుకొచ్చింది. వాళ్ళూవీళ్ళూ నచ్చచెప్పటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎవరి మాట వినటంలేదు. తన పట్టుదలే పట్టుదల. తనమాటే మాట.. ఏవేళ్టప్పుడు జయప్రద మనస్సులో పెళ్ళిని గురించిన అభిప్రాయాలు నాటుకుపోయినాయోకాని, అప్పటినుంచి పెళ్ళంటేనే అసహ్యం పుట్టుకొచ్చింది. ఇవ్వాళ హఠాత్తుగా పెళ్ళనేటప్పటికి జయప్రదకు మతిపోయినట్లనిపించింది. బొమ్మలాగ అలంకరించుకుని తయారయి వచ్చింది.

అనుకుంటుండగానే పెళ్ళివారు వాకిట్లోకి రానేవచ్చారు. నలుగురు ముత్తయిదువలు వచ్చి కూర్చున్నారు. జయప్రద స్నేహితురాళ్ళు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఒకరివెంట ఒకరు వస్తున్నారు. జయప్రద తలెత్తి చూడనేలేదు. కళ్ళన్నీ ఎర్రబడ్డాయి ఏడ్చి ఏడ్చి. ఇక్కడ నలుగుర్లోను కళ్ళనీళ్ళపెట్టుకోవటానికి భిడియపడి అపుకుంది పట్టు బలవంతాన.

సావిత్రి దొడ్డిగుమ్మం ముందు నిలబడి, తలుపుచాటుగా వచ్చిన వరున్ని వోరకంటతో చూస్తోంది. జయప్రద మొహం చూడాలని ఎంత ప్రయత్నించినా వీలుపడనేలేదు. వంచిన తల ఎత్తకుండానే కూర్చుంది. కాస్తంత తలెత్తమ్మాఅని వరసగా వంతులుప్రకారం అంటూనే వున్నారు కాని జయప్రద మాత్రం వంచిన తలఎత్తనే లేదు.

అప్రయత్నంగా సావిత్రి కళ్ళవెంబడి నీళ్ళు గిర్రున తిరిగి క్రిందపడ్డాయి. గబగబ కళ్ళు తుడుచుకుంది.ఎవరైనా చూస్తారేమోనాఅన్నట్లు

పెళ్ళిచూపులు అయిపోయినాయి. పెళ్ళికొడుకు సరే అన్నతర్వాత, జయప్రదను అడిగే సాంప్రదాయమే లేదు, లగ్నాలు పెట్టేశారు. పెళ్ళిముహూర్తం సమీపిస్తోంది.

జయప్రద కళ్ళు తుడుచుకుంటూనే వుంది. అగ్నిహోత్రం చుట్టూ తిరుగుతూనే వుంది. దూరాన్నుంచి సావిత్రి అన్నీ చూస్తూనేవుంది. తన దుఃఖానికి అంతులేదు. పట్టరాని ఉక్రోషం. ఆవేశం, ఉద్రేకం, తన్నుకుపోతోంది. ఆక్షణంలో చేసేదేమీ కనబడింది లేదు. జయప్రద పెళ్ళి అయిపోతోంది. తానేమో తానుగానే ఉండిపోయింది. ఉబుక్కొస్తున్న కోపాన్ని అణచుకుంటూ తీవ్రంగా బాధపడిపోతోంది. తల్లిని ఖచ్చితంగా అడిగేద్దామనుకుటోంది. తనకు గూడా పెళ్ళిచేసెయ్యమని. తనకు వచ్చినంత ఆవేశంతోపాటు ధైర్యం రావటం లేదు. మళ్ళీ వెనక్కు జంకుతోంది. ముందువెనకలు ఆలోచిస్తూ మధ్యనపడిపోతోంది. సాయంత్రంపెళ్ళి వూరేగింపు. జయప్రద స్నేహితురాళ్ళందరూ ఆడుతూపాడుతూ ఎగతాళిచేస్తూ పల్లకీదగ్గరకు వచ్చేశారు. ఆ అమ్మాయి మనస్సు తీవ్రంగా కలవరపడుతున్నా, ఆసంరంభం చూసేటప్పటికి తనను తాను మరచిపోయినట్లయింది. స్నేహితురాళ్ళతో చనువుగా మాట్లాడుతూనే వుంది. నలుగురూ కూడా సావిత్రేదీ అన్నారు.

సావిత్రి అక్కడకు రాలేదు. ఎక్కడో తిరిగ్గా కూర్చునిజయప్రద అదృష్టాన్ని గురించి, తనదురదృష్టాన్ని గురించి చర్చించుకుంటూవుంటుంది. అఘాయలకైనా రాలేదు. మనస్సొప్పలేదు. ఎంతో చిన్నతనమయిపోయింది. నలుగుర్లోకి వచ్చి తనమొహం చూపించటానికి ఎంతోబిడియపడింది. తనతోటి స్నేహితురాలికి పెళ్ళిఅయిపోయింది. తనకు కాలేదు. ఎంత అవమానం అని తీవ్రంగా మనస్సులో బాధపడుతోంది. జయప్రద పల్లకీలో కూర్చుని సావిత్రెక్కడ అనుకుంది! సావిత్రి పెళ్ళిని గురించి చెప్పినమాటలు తాను చెప్పిన సమాధానం రెండూ గుర్తుకొచ్చి కళ్ళు చెమ్మగిల్లినాయి. తనకు ఎంతో అవమానం జరిగిందని తీవ్రంగా బాధపడుతోంది. ఇంకా సావిత్రిని ఏమొహం పెట్టుకు చూడగలను అనుకుని త్రుళ్ళిపడింది.

సావిత్రి తన శరీరాన్ని దాచుకుంటూ దొంగలా తప్పించుకుంటో ఎక్కడికో పారిపోవటానికి ప్రయత్నం చేస్తున్నట్లు బెరుకుగా నడుస్తోంది.

''అడుగో సావిత్రి ...'' అన్నది వోఅమ్మాయి చటుక్కున. సావిత్రి ఒళ్ళు జల్లుమన్నది. గుండె ఆగినంత పని అయింది. కళ్ళు రెండు చేతులతో గట్టిగా మూసుకుని, స్థబ్దురాలై నిలబడిపోయింది.

నలుగురు స్నేహితురాళ్ళూ గబగబ వచ్చేశారు. సావిత్రి రెండు చేతులు మొహం మీద నుంచి తియ్యాలని ప్రయత్నం చేస్తున్నారు. మాట్లాడదు. కదలదు. మెదలదు. బలవంతాన రెండుచేతులు లాగారు. సావిత్రి భోరున ఏడ్చింది.

ఏమిటి అంటూ ఆశ్చర్యంగా చూశారు నలుగురూను.

....మాఅమ్మ! నాన్న ... నాకు పెళ్ళి చెయ్యరు ..... నాకు పెళ్ళిచెయ్యరు ...వెక్కి వెక్కి ఏడుస్తూ గద్గదంగా అన్నది సావిత్రి.

''సావిత్రీ! ... నాపెళ్ళయి పోయింది! ... అంటూ హోరున ఏడ్చింది జయప్రద.

స్నేహితురాళ్ళు నలుగురూ ఫక్కున నవ్వారు.



మున్న నక్షత్రంనుండి వచ్చే వెలుగు నాలుగుంపావు ఏళ్లపాటు ఆకాశంలో ప్రయాణంచేసి చేసి మన భూమిని చేరుకొంటుంది. అలాగే, ఎర్రగానున్న జ్యేష్ఠ నక్షత్రం నుండి వచ్చే కాంతి రెండు వందల ఏభై ఏళ్ల ప్రయాణం చెయ్యాలి. ఆర్ద్రా నక్షత్రం మనకు మూడు వందల సంవత్సరాల దూరంలో వుంది. అంటే, నక్షత్రాలు మనం చూచినప్పుడు ఎట్లున్నాయో తెలిసికొనే భాగ్యం లేదని గ్రహించాలి. ఈ రాత్రివీరు ఆర్ద్రా నక్షత్రాన్ని చూడండి. సరిగ్గా నెత్తిమీద మృగశిర ప్రక్కనేఉంది.ఎర్రగా కనిపిస్తుంది. కాని,మూడు వందల సంవత్సరాలక్రిందట ఆర్ద్ర ఎట్లుండేదో ఆరూపే మీకీ రాత్రి కనిపిస్తుంది. మీకళ్లల్లో ఈరాత్రి పడే ఆర్ద్ర యొక్క కాంతి మూడు వందల ఏండ్ల క్రిందట ఆర్ద్రనుండి బయలు దేరింది. ఈ మూడు వందల ఏండ్లపాటు ఆకాశంలో ప్రయాణం చేస్తూనే ఉంది. ఈరాత్రి మీకళ్లలో పడుతుంది. అందుచేత, ఈక్షణాన్ని ఆర్ద్ర ఎట్లుందీ అని ప్రశ్నించుకుంటే దానికిసమాధానం ఇప్పుడురాదు; మరి మూడు వందల ఏళ్ళు పోయేక తెలిసికోగలం ఈవిధంగా నక్షత్రాలను మనం చూచినప్పుడు వాటి ప్రస్తుత రూపం కనిపించదు. కొన్నేండ్ల క్రిందట అవి ఏట్లుండేవో ఆరూపులు మాత్రమే కనిపిస్తాయి. ఆశ్చర్యమైన సంగతి కదూ !

రంగు రంగులతోమెరుస్తూన్న ఈనక్షత్రాలు

(24 వ పేజీ తరువాయి)

ఎప్పుడు పుట్టాయి. ఎలా పుట్టాయి, అనిచాలా కాలం నుంచి యోచిస్తున్నారు జ్ఞానులు. ఇప్పటికి కూడా ఆరహస్యం తెలియలేదు. కాని,యంత్రాలతో నక్షత్రాలను చూస్తున్నారు: వాటి కాంతిని రకరకాలుగా పరీక్షచేసి అవెంతెంత దూరంలో నున్నాయో,వాటి బరువు ఎంతో, వాటిలో ఏయే పదార్థాలున్నాయో లెక్కలు కట్టు చున్నారు.నక్షత్రాలలో ఎన్నో రకాలున్నాయి.కొన్ని చాలాపెద్దవి. కొన్ని చాలా వేడిగా నున్నాయి.కొన్ని చాలాబరువుగా నున్నాయి మీరీ రాత్రి జాగ్రత్తగా నక్షత్రాలను చూడండి.వాటిలో కొన్ని ఎర్రగాను, కొన్ని నీలంగాను, కొన్ని తెల్లగాను ఉన్నట్లు తెలిసికొంటారు. నక్షత్రాల రంగును బట్టి వాటి వేడిని నిర్ణయించగలరు. వాటి సైజునుబట్టి వామనతారలనీ, రాక్షసతారలనీ విభాగం చేసేరు.

వీటి పుట్టుకను గురించి ఒక విధంగా అనుకొంటున్నారు. కొన్ని కోట్ల యేండ్ల క్రిందట నక్షత్రాలుగా ఏర్పడినపదార్థమంతా ఒక్కప్రోగుగా ఉండేదట. దాని వేడిని, బరువుని వూహించలేము. అలా వుండగా, అందులో ఏదో విధంగా ఒక ప్రేలుడు కలిగింది. పటాస్‌కాయ పేలినప్పుడు చిన్నచిన్న ముక్కలుగా తెగిపోయినట్లు, ఆపదార్థం ముక్కముక్కలైంది.ఆ ముక్కలు ఒకదానినుండి ఒకటి దూరంగా పారిపోవడం మొదలు పెట్టేయి. ఇప్పటికీ అలాగే పారిపోతున్నాయి. ఒక్కొక్క ముక్కలో కొన్నికోట్ల నక్షత్రాలున్నాయి.అలాంటి ముక్కలు కొన్ని కోట్లున్నాయి. దూరంగా పోతూన్న ముక్కలను 'గెలక్సీ'లన్నారు. ప్రతిగెలక్సీలోనున్న నక్షత్రాలన్నీ ఒక గుంపులోనుండి,కలిసి ప్రయాణంచేస్తున్నాయి. గెలక్సీ దూరంగా పోతూన్న కొద్ది మరీ వేగంగా పారిపోతూంది..అంటే బలిచక్రవర్తి తన రాజ్యాన్ని వామన మూర్తికి దానమిచ్చినప్పుడు, వామనుడు పెరిగిపోయేడని మీరు చదువుకొనిఉంటారు,చూస్తుండగానే "ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభోవీధిపైనంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై నంతై చంద్రుని కంతయై ధ్రువునిపైనంతై మహర్వాటిపై నంతై సత్యపథోన్నతుండగుచు బ్రహ్మండాంత సంవర్ధియై "రవిబింబంబుపమింప బాత్రమగు చత్రంబై శిరోరత్నమై శ్రవణాలంకృతయై గళాభరణమై సౌవర్ణ కేయూరమై చవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర ప్రవరంబై పదపీఠమై వటుడు దాబ్రహ్మాండమున్ నిండుచోన్" ఎంత ఆశ్చర్యం! అలాగ్గానే ఈబ్రహ్మాండమే పెరిగిపోతుంది. దీనికి అంతుందా? ఏమో! ఇవన్నీ జ్ఞాపకం పెట్టుకొని రాత్రి నక్షత్రాలను మరొకసారి చూడండి, వాటి గురించి ఆలోచించండి !

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)



అడవిలో రహదారి ....

— వై. సావిత్రి